క్లుప్తంగా

యువత సన్మార్గంలో నడవాలి



కళాజాతలో మాట్లాడుతున్న ఎస్‌ఐ

యాలాల: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, సన్మార్గంలో నడవాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని ఎస్‌ఐ అరవింద్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని దేవనూరు గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. మద్యానికి యువత దూరంగా ఉండాలన్నారు. సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించి, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలన్నారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడం, ఈవ్ టీజింగ్ లేకుండా చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తుంచుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో 100 డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు మంత్రి వెంకటయ్య, క్రిష్ణ, వెంటయ్యగౌడ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కొడంగల్ రూరల్: పట్టణంలోని 9వ వార్డులో సీసీరోడ్డు, డ్రైనేజ్ పనులను గురువారం బీఆర్‌ఎస్ నాయకుడు అంజద్‌ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాణదారులతో ఆయన మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

వసతుల కల్పనకు సర్వే

ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ ఫణికుమారి



పోచమ్మతండా సర్వేలో ఈఈ

కొడంగల్ రూరల్: తండాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా.. ఉన్న వాటిని పరిష్కరించేందుకు సమగ్రసర్వే చేస్తున్నామని ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ ఫణికుమారి చెప్పారు. ఈ మేరకు గురువారం ఆమె మండల పరిధి తండాల్లో సమస్యలపై ఆరాతీసి, నమోదుచేసుకున్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని వసతులు కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సర్వే చేయిస్తున్నారని ఆమె తెలిపారు. త్వరలో దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో సర్వే చేయడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో పోచమ్మతండా సర్పంచు శంకర్‌నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దిగుబడిని అంచనా వేసుకోవాలి



కంది పంటను అంచనా వేస్తున్న సందీప్‌రెడ్డి

దోమ: రైతులు పంట దిగుబడిని అంచనా వేసుకోవాలని పంట ప్రయోగాల మండల గణంకాల అధికారి సందీప్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని దొర్నాల్‌పల్లిలో గ్రామానికి చెందిన హరిశ్చందర్ నాయక్ పొలంలో కంది పంటను అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు పంట దిగుబడిని అంచనా వేసుకుంటేనే.. లాభనష్టాలు తెలుస్తాయని చెప్పారు. వ్యవసాయ అధికారుల సూచనలతో సాగు చేసుకున్నట్లయితే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

'మా భూములను కాపాడండి'

అనంతగిరి: ఏళ్ల తరబడి వ్యవసాయం చేసుకుంటున్న భూముల్లో అటవీ శాఖ అధికారులు చెట్ల కోసం గుంతలు తీయడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వికారాబాద్ మండలం మదన్‌పల్లి గ్రామంలో వైఎస్సార్ హయాంలో నిరుపేదలకు పట్టాలు ఇచ్చారని తెలిపారు. నాటి నుంచి బ్యాంకుల ద్వారా రుణాలు పొంది వ్యవసాయం చేస్తున్నామన్నారు. ధరణి రావడంతో కొత్త పుస్తకాలు రాలేదని, కొత్త పుస్తకాలు ఇవ్వాలని రెవిన్యూ అధికారులను అడిగితే.. అటవీ అధికారుల అభ్యంతరం ఉన్నందున ఇవ్వడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కల్పించుకొని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

సర్కారు బడులకు కొత్త సొబగులు



ముజాహిద్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో తుదిదశలో పనులు

మనబడి పనులు ముమ్మరం

- అన్నిహంగులతో ఆధునికీకరణ
- కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సుందరీకరణ
- విద్యార్థుల సౌకర్యాలపై అధికారుల దృష్టి

కుల్కచర్ల: సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న సర్కారు బడులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మసకబారిపోతున్న విద్యాలయాలను కొత్తగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించింది. అందులో భాగంగా కుల్కచర్ల మండల పరిధిలోని 26 పాఠశాలలను ఎంపిక చేసింది. భవన నిర్మాణాలకు గాను రూ. 3కోట్ల 75లక్షల నిధులను మంజూరు చేసింది. ఉపాధిహామి పథకం ద్వారా రూ. 5కోట్ల పనులను ఆయా పాఠశాలల్లో చేపట్టనున్నారు. ప్రస్తుతం 23 పాఠశాలలలో మనఊరు–మనబడి పనులు చకచకా జరుగుతున్నాయి. జనవరి26 జెండా వందనం.. కొత్త భవనాల్లోనే నిర్వహించాలన్న ఉద్దేశంతో పనులు వేగిరం చేశారు.

కాస్త ఉపశమనం..

మండలంలో 68 పాఠశాలలు ఉండగా.. మనఊరు–మనబడి పథకంలో భాగంగా మొదటి విడతలో 26 బడులను ఎంపిక చేశారు. అలా ఎంపిక చేసిన వాటికి పనులు ప్రారంభం కాగా.. మరో మూడింటికి టెండర్లు పిలవాల్సి ఉంది. 10 పాఠశాలలో పనులు పూర్తయ్యాయి. ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టాల్సిన పనులను ప్రారంభించగా.. అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ఏళ్లతరబడి పేరుకుపోయిన పనులకు మనఊరు–మనబడితో మోక్షం కలిగింది. దీంతో ఇప్పటివరకు పురాతన భవనాల మధ్య ఇబ్బందికరంగా విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు.. కొంత ఉపశమనం కలగనుంది.

విద్యాభివృద్ధికి దోహదం



మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను అభివృద్ధి చేయడం సంతోషకరం. బడులను ఆధునీకరించడం వలన విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పాఠశాల ప్రాంగణం ఆహ్లాదకరంగా మారింది. ఇలాంటి కార్యక్రమాలు విద్యాభివృద్ధికి దోహదం చేస్తాయి.

– వెంకటయ్య, ప్రధానోపాధ్యాయుడు, ఎంపీపీ ముజాహిద్‌పూర్.

నిరంతరం పర్యవేక్షిస్తున్నాం



మనఊరు–మనబడి పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. నాణ్యతపై ప్రత్యేకదృష్టి సారిస్తూ.. నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రస్తుతం 16 పాఠశాలల్లో పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. మరికొన్నిరోజుల్లో పనులు పూర్తవుతాయి.

– రాఘవేందర్, ఏఈ

పాఠశాలల అభివృద్ధే ధ్యేయం

- 'మనబడి' పనులు పూర్తి చేయండి
- మండల విద్యాధికారి హరిశ్చందర్

దోమ: మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో జరుగుతున్న పనులను కాంట్రాక్టర్లు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. గురువారం మండల పరిధిలోని కిష్టాపూర్, బుద్లాపూర్, బ్రహ్మణపల్లి, దిర్సంపల్లి పాఠశాలలను నోడల్ అధికారి నర్సింహులుతో సందర్శించి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తుందని, చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. కంపౌండ్ వాల్స్, కిచన్‌షెడ్, నూతన భవనాల నిర్మాణం, టాయిలెట్స్‌తో పాటు తదితర పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు. అనంతరం పాఠశాలలో రికార్డులను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. పది పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు.

పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

పదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి, వారిలో నైపుణ్యతను వెలికితీయాలని ఎంఈఓ ఉపాధ్యాయులకు సూచించారు. ఎఫ్‌ఎల్‌ఎన్, ఎఫ్‌ఏ1, ఎఫ్‌ఏ2, ఎస్‌ఏ1 ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవాలన్నారు. సూడెంట్స్‌కు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పురందాస్, మహేందర్‌బహాదుర్, సర్పంచులు, పాఠశాల చైర్మన్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఏంఈఓ

పీఎంశ్రీ నిధులతో పాఠశాలల అభివృద్ధి



మరికల్ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

కుల్కచర్ల: పాఠశాలల అభ్యున్నతికి క్షేత్రస్థాయిలో పరిశీలన కార్యక్రమాలు చేపట్టామని ఎంఈఓ హబీబ్ అహ్మద్ అన్నారు. గురువారం చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ క్లస్టర్‌లో పలు పాఠశాలలను పరిశీలించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత పాఠశాలల ఉన్నతికి కేంద్రం నూతనంగా తీసుకువస్తున్న పీఎంశ్రీ (పీఎం స్కూల్స్ ఫర్ రైజింజ్ ఇండియా) పథకం ద్వారా మండలంలో రెండు పాఠశాలలను ఎంపిక చేసి, వాటి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. అందులో భాగంగా పలు పాఠశాలలను పరిశీలిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మరికల్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, ఉపాధ్యాయులు శంకర్, రాములు, సీఆర్పీ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

పూడూరు: కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూనేటి కిరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం రాకంచర్లలో నిర్వహించిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయిలో ఇంటింటికీ తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా ఆదేశాల మేరకు ఈ నెల 7న పరిగిలో జరిగే వర్చువల్ సమావేశ కార్యమానికి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పరిగి అసెంబ్లీ పాలక్ ఆకుల విజయ, పార్టీ జిల్లా కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్, మండల అధ్యక్షుడు అనిల్, నాయకులు రాజేశ్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, మాణిక్యం, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ కొలువులు
- ఆటల్లో గెలుపోటములు సహజం
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



పరిగి: క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



కుల్కచర్ల: పోటీలను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి

పరిగి: క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మాదారం గ్రామంలో నిర్వహించిన టోర్నమెంటును ప్రారంభించి మాట్లాడారు. ఆటలతో ఎన్నో లాభాలు ఉన్నాయని, క్రీడలతో సత్సంబంధాలు మెరుగుపడడంతో పాటు.. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోట ద్వారా కొలువు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. అంతేకాదు ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కావున విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి నియోజకవర్గానికి పేరు ప్రతిష్టలు తేవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల అనిల్‌రెడ్డి, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, ప్రవీణ్‌రెడ్డి, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో బహుముఖ ప్రయోజనాలు

కుల్కచర్ల: క్రీడల వలన మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వం పెరుగుతుందని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బండవెల్కిచర్లలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడల వలన యువత భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, స్థానిక సర్పంచ్ శిరీష, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటలపై యువత దృష్టి సారించాలి

మర్పల్లి: క్రీడలపై యువత దృష్టి సారించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుకర్ సూచించారు. గురువారం బూచన్‌పల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన జాజుగుబ్బడి తండాలో మండల స్థాయిలో జరిగే క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆటలు ఆడడంతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం చేకూరుతుందని చెప్పారు. పోటీలో గెలుపొందిన జట్టుకు ఆయన నగదుతో పాటు షీల్డ్ ప్రదానం చేశారు.

సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యత

మున్సిపల్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి



అండర్‌డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి చెప్పారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 1,10,14వార్డుల్లో రూ.14లక్షలతో అండర్‌డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసకుంటున్న తెలిపారు. ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులను తీసుకువచ్చి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాగా, ప్రజలు కూడా పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్‌లు జూలకంటి స్వేతపాండురంగారెడ్డి, బొడ్డు లావణ్య శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమౌళి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మర్పల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కృష్ణారెడ్డి ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇచ్చిన మాట తప్పిన రాష్ట్ర ప్రభుత్వానికి.. వచ్చే ఎన్నికల్లో ఓటు అడిగే హక్కులేదన్నారు. ఓటు అనే ఆయుధంతో ప్రజలు ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కృష్ణారెడ్డి చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు సలీం, జిల్లా సీనియర్ నాయకులు శంకరయ్యగౌడ్, సంజీవరెడ్డి, అశోక్‌రెడ్డి, గోపాల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు సురేష్, రాచన్న, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

బంట్వారం: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ కుడుగుంట ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం టీయూటీఎఫ్ బంట్వారం మండల అధ్యక్షుడు బంటు సుదర్శన్ ఆధ్వర్యంలో ఆ సంఘం 2023 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు హక్కులతో పాటు బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. చిత్తశుద్ధితో పనిచేసే సంఘాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ చంద్రప్ప, సర్పంచ్‌లు, టీయూటీఎఫ్ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచే నాయకులుగా ఎదగాలి

- బీజేపీ చేవెళ్ల అసెంబ్లీ పాలక్ జితేందర్‌రెడ్డి
- బూత్‌స్థాయి నాయకులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: బూత్‌స్థాయిలో కార్యకర్తలు బలోపేతం అయితేనే ప్రజాప్రతినిధులుగా నాయకులుగా ఎదుగుతారని, పార్టీ బలోపేతం అవుతుందని బీజేపీ చేవెళ్ల అసెంబ్లీ పాలక్, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు అన్నారు. మండలకేంద్రంలో గురువారం చేవెళ్ల మండల బూత్‌స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు చేస్తున్న అవినీతికి అధికార యంత్రాంగం వత్తాసు పలుకుతుందని, దీనిని ఎండగట్టేందుకు సోషల్ మీడియా వేదికగా యువత స్పందించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా వ్యవహరించి, ప్రధానమంత్రి నరేంద్రమోడీ అందిస్తున్న పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కేంద్రం ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించి.. ప్రజలకు మేలు చేసే బీజేపీ అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రతికార్యకర్త కృషి చేయాలని చెప్పారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఇస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పాండు రంగారెడ్డి, రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు, నియోజకవర్గం నేతలు జంగారెడ్డి, కంజర్ల ప్రకాశ్, విఠల్‌రెడ్డి, శ్రీనివాస్, అత్తెల్లి అనంత్‌రెడ్డి, బూత్ స్థాయి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈనెచెరువుకు మరమ్మతులు



చెరువు మరమ్మతుకు పూజలు చేస్తున్న సర్పంచు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకురావడం అభినందనీయమని బండవెల్కిచర్ల సర్పంచ్ శిరీష అన్నారు. గురువారం ఐసీఐసీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈనెచెరువుకు మరమ్మతులు చేపట్టేందుకు పూజాకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు మాట్లాడుతూ... చెరువుమరమ్మతు వలన పరోక్షంగా రైతుల అభ్యున్నతికి బ్యాంకు పా టుపడుతుందని చెప్పారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

ధారూరు: ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల్లో ఏమైనా అక్రమ రవాణ జరుగుతుందా అనే అనుమానంతో పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. సీఐ అప్పయ్య ఆధ్వర్యంలో ఎస్‌ఐ నరేందర్, సిబ్బంది ధారూరులోని తాండూర్–హైదరాబాద్ ప్రధాన రహదారిలో వెళ్తున్న వాహనాలను ఆపి సోదా చేశారు. అనుమతి లేకుండా రేషన్ బియ్యం, కలప, ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



ఆర్టీసీ బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

రోడ్డు విస్తరణ పనులు పునఃప్రారంభం

మోమిన్‌పేట: మండల కేంద్రం మోమిన్‌పేటలో రెండు కిలో మీటర్ల మేర నాలుగు వరుసల రోడ్డు వెడల్పు పనులు రెండు సంవత్సరాల తర్వాత పునః ప్రారంభం అయ్యాయి. నాడు వంద మీటర్ల మేర ఆగిపోయిన సీసీ పనులు సైతం నేడు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇదిలా ఉండగా.. గతంలో చేపట్టిన పనులను పూర్తి చేయలేదు. దీంతో పాటు బీటీ, కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. నాలుగు వరుసల రోడ్డు వెడల్పు పనులు గడిచిన ఆరేళ్లుగా నత్తనడకన కొనసాగుతుండటంతో మోమిన్‌పేట ప్రజలు, వ్యాపారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నాతాధికారులు చొరవ చూపి, నిలిచిన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ప్రారంభమైన రహదారి విస్తరణ పనులు

ఘనంగా బోనమ్మకు బోనాలు

తాండూరు రూరల్: అంతారంలో బోనాల జాతర ఘనంగా జరిగింది. ఊరడమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం బోనమ్మ మాతకు ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళా భక్తులు బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. డప్పువాయిద్యాలు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలతో బోనాలమ్మకు భక్తులు నైవేద్యం సమర్పించారు. సర్పంచు రాములు, ఎంపీటీసీ శాంతు, ఉపసర్పంచు జీవ రత్నం, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



బోనాలతో వెళ్తున్న భక్తులు